విశాలాంధ్ర విశాఖపట్నం
పేజి నెం. 5
శనివారం 31, ఆగస్టు, 2024

చెత్త నుండి సంపద తయారీ కేంద్రం పరిశీలించిన డీపీఓ శ్రీనివాసరావు

విశాలాంధ్ర - ఆనందపురం : మండలం లో శుక్రవారంజిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు సుడిగాలి పర్యటన చేశారు. అందులోని భాగంగా చెత్త నుండి సంపద తయారీ కేంద్రం, షెడ్లు పరిశీలన చేసి,100 రోజులు కార్యక్రమంలో వేముల వలస, గంభీరం కేంద్రాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఈఓపిఆర్డి రామారావు, వేముల వలస పంచాయతి కార్యదర్శి రామకృష్ణ నాయుడు, గంభీరం పంచాయతీ కార్యదర్శి చలపతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రోగ్రెస్‌లో తల్లిదండ్రులను కూడా భాగస్వామ్యం చేస్తాం..

చంద్రంపాలెం జడ్పీహెచ్ పాఠశాలను తనిఖీ చేసిన మంత్రి లోకేష్

విశాలాంధ్ర - కొమ్మది : బడిబాట కార్యక్రమంలో భాగంగా విశాఖలోని చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పాఠశాలకు విచ్చేసిన మంత్రికి విద్యార్థులు, ఉపాధ్యాయులు పుష్పగుచ్ఛాలతో భారీగా స్వాగతం పలికారు. పాఠశాల ఆవరణలోని సరస్వతీ దేవి విగ్రహానికి మంత్రి పూలమాల వేశారు. పాఠశాల ఆవరణలో మొక్క నాటారు. చంద్రపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న వివిధ సెక్షన్లను మంత్రి తనిఖీ చేశారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలోనే అతిపెద్ద పాఠశాల అని, ఇక్కడ చదువుకున్న విద్యార్థులు ఐఐటీ వంటి ప్రముఖ విద్యాసంస్థల్లో సీట్లు పొందారని మంత్రి వారిని ఉత్తేజపరిచారు. విద్యార్థుల పాఠ్యపుస్తకాలను ఈ సందర్భంగా మంత్రి పరిశీలించారు. పాఠశాలలో ఉన్న ఆటస్థలం సరిగా లేదనే విషయాన్ని మంత్రి గుర్తించారు. వర్షంతో నీరు నిలవడాన్ని గమనించారు. సదరు క్రీడా ప్రాంగణాన్ని అభివృద్ధి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. పాఠశాలలో మెరుగుపర్చాల్సిన సౌకర్యాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలకు వచ్చేందుకు మెయిన్ రోడ్డు దాటాల్సి వస్తోందని, ఫ్లైఓవర్ నిర్మించాలని ఓ విద్యార్థి అడిగారు. పరిశీలిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. కమ్యూనిటీ హాల్, పెద్ద లైబ్రరీ నిర్మించాలని మరో ఇద్దరు విద్యార్థులు అడిగారు. పాఠశాలలో సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్ ఉన్నాయని, ఇంగ్లీషు ల్యాబ్ కావాలని విద్యార్థులు కోరారు. సైన్స్ ల్యాబ్ లో ఎక్విప్ మెంట్స్ ఉన్నాయా, ప్రోగ్రామింగ్ ఎవరైనా నేర్చుకున్నారా, బైజూస్ కంటెంట్ ఎలా ఉంది, టీవీలు పనిచేస్తున్నాయా అని మంత్రి ఆరా తీశారు. ఉపాధ్యాయాలు సరిగా పాఠాలు బోధిస్తున్నారా, స్కూల్ బ్యాగులు, పాఠ్యపుస్తకాలు, బూట్ల నాణ్యత ఏవిధంగా ఉందని అడిగి తెలుసుకున్నారు. బాగున్నాయని ముక్తకంఠంతో విద్యార్థులు చెప్పారు. పాఠశాలలో బాలురు, బాలికలు వినియోగిస్తున్న మరుగుదొడ్లను మంత్రి స్వయంగా పరిశీలించారు. ఫ్లోర్ అపరిశుభ్రంగా ఉండటాన్ని గమనించారు. పాఠశాలలో తాగునీరు అందించడంతో పాటు మరుగుదొడ్లలో నీటి సరఫరా మెరుగుపర్చాలని, బాలిక మరుగుదొడ్లకు సరైన డోర్లు లేవనే విషయాన్ని విద్యార్థినులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా పారిశుద్ధ కార్మికులను, ఆయాలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎంతమంది విద్యార్థులకు ఎన్ని మరుగుదొడ్లు ఉన్నాయని ఆరా తీశారు. బాలుర మరుగుదొడ్లు సరిగా లేవన్నారు. సాధ్యమైనంత త్వరగా మరుగుదొడ్లకు మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. భవిష్యత్ లో విద్యార్థులు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ ఆకాంక్షించారు. విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ చెప్పారు. అనంతరం పాఠశాల ఆవరణలోని ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మంత్రి లోకేష్ వెంట భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ చిరంజీవి రావు, అధికారులు కూటమి నేతలు పాల్గొన్నారు.

హాస్టళ్ల సమస్యలపై లోకేష్‌కి ఏఐఎస్ఎఫ్ వినతి

విశాలాంధ్ర - విశాఖ : ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ హాస్టళ్లలో సరైన మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని విద్యాశాఖా మంత్రి నారా లోకేష్‌కి ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు తెలిపారు. విశాఖ టీడిపి కార్యాలయంలో శుక్రవారం అయన్ని ఏఐఎస్ఎఫ్ నాయకులు కలిసి వివిధ అంశాలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ విశాఖ జిల్లా కార్యదర్శి యు. నాగరాజు మాట్లాడుతూ విద్యార్థులకు నెలవారీ కాస్మోటిక్ ఛార్జీలు విడుదల చేయాలని , శాశ్వత వసతి భవనాలు కేటాయించాలని, ప్రస్తుత ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు పెంచాలని విద్యార్థులకు రూ.2500 చొప్పున ఇవ్వాలనీ, పెండింగ్ లో ఉన్న మెస్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని కోరామని తెలిపారు. యువగళం పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం పీజీ విద్యార్థులు శాపంగా మారిన జీవో నెంబర్ 77 రద్దు చేసి ఫీజు రియంబర్స్ మెంట్ వచ్చే విధంగా చూడాలని కోరినట్లు చెప్పారు. దీనిపై నారా లోకేష్ స్పందిస్తూ గత ప్రభుత్వం ఖజానా ఖాళీ చేసిందని, ఏది ఏమైనప్పటికీ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కారయ్యేలా కృషి చేస్తామని హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎన్ శ్రీను, జిల్లా సమితి సభ్యులు శేఖర్, దిలీప్, పాల్గొన్నారు.

సీపీఐ సభ్యురాలు సుబ్బలక్ష్మి మృతి పార్టీకి తీరని లోటు

విశాలాంధ్ర - పెదగంట్యాడ : పెద గంట్యాడ సిపిఐ శాఖా సహాయ కార్యదర్శి పెద పూడి దుర్గారావు సతీమణి, సీపీఐ సభ్యురాలు సుబ్బలక్ష్మి ఆకస్మిక మృతి సిపిఐ పార్టీకి తీరని లోటని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, జీవీఎంసీ సిపిఐ ఫ్లోర్ లీడర్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు ఏ.జె.స్టాలిన్ అన్నారు. సుబ్బలక్ష్మి పార్థివ దేహాన్ని సిపిఐ నేతలు సందర్శించి నివాళులర్పించారు. అనంతరం సిపిఐ నేతలు మాట్లాడుతూ కామ్రేడ్ సుబ్బలక్ష్మి సీపీఐ పార్టీలో కీలకంగా పని చేశారని కొనియాడారు. సుబ్బలక్ష్మి కుటుంబానికి సీపీఐ పార్టీ ప్రగాఢ సానుభూతిని ప్రకటించింది. సుబ్బలక్ష్మి మృతికి నివాళులు అర్పించిన వారిలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కసిరెడ్డి సత్యనారాయణ, కె.సత్యాంజనేయ, బి.వెంకటరావు, జి.రాంబాబు, నాయకులు జి.ఆనంద్, కె.అచ్యుతరావు, అప్పారి విష్ణుమూర్తి, పల్లె టిపోలయ్య, తాండ్ర కనక రాజు, కె.రాజబాబు, మహిళా సమాఖ్య నేతలు ఏ.విమల, బేగం, కె.వనజాక్షి, పిల్లా పద్మ, దుర్గారావు కుటుంబ సభ్యులు ఉన్నారు.

మొక్కల నాటుదాం... పర్యావరణాన్ని రక్షిద్దాం

విశాలాంధ్ర - ఆనందపురం : మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు మొక్కలు నాటుదాం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అనే నినాదంతో శుక్రవారం మండలంలో తర్లు వాడ పంచాయతీ పరిధిలో స్థానిక సర్పంచ్ బిఆఆర్‌బి.నాయుడు ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వృక్షో రక్షిత రక్షితః చెట్లను మనం కాపాడితే అవి మనల్ని కాపాడతాయని తెలిపారు కార్యక్రమంలో ఎంపీడీవో అడపాలవరాజు, ప్రెసిడెంట్ బిఆర్‌బి నాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటరావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - మల్కాపురం : పారిశ్రామిక ప్రాంతం పరిధి 59 వ వార్డు 60వార్డు 61 వ వార్డు పరిధి గొల్లలపాలెం మల్కాపురం ఇందిరాకాలనీలో శుక్రవారం ఫ్రైడే - డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ వార్డ్ అధ్యక్షులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిసరాల శుభ్రతే మన ఆరోగ్యానికి భద్రత అనే విషయాన్ని ప్రతీ ఒక్కరూ గుర్తుంచుకోవాలని అన్నారు. సీజనల్ వ్యాధులు ప్రభలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అందుకు అనుగుణంగా మన ఇంటితో పాటు ఇంటి చుట్టుపక్కల పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. దోమల నియంత్రణకోసం శ్రమిస్తున్న అధికార యంత్రాంగానికి ప్రజలంతా సహరించాలని పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవటంతో పాటు ఇంటిలోని ట్యాంకులు, కుండీలను వారానికి ఒకరోజు కాలీగా ఉంచటం ద్వారా దోమల వృద్ధిని అరికట్టవచ్చని అన్నారు. ఇంట్లోని చెత్తను రోడ్లపైనా, కాలువలలోనూ వేయకుండా శానిటరీ సిబ్బందికి అందించటంతో పాటుగా పర్యావరణానికి హానికరమైన ప్లాస్టిక్ వినియోగాన్ని ఎవరికి వారుగా నియంత్రించుకోవాలని పిలుపునిచ్చారు. చిన్నపిల్లలకు వేసే టీకాల విషయంలో తల్లిదండ్రులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని సాధారణ టీకాలతో పాటుగా ఐదేళ్ల లోపు పిల్లలకు ప్రతీ ఆరు నెలలకు ఒకసారి ఏ విటమిన్ సిరప్ వేయటం ద్వారా భవిష్యత్తులో కంటి సమస్యలు రాకుండా ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్స్పెక్టర్ శనిటరీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

వనం - మనం కార్యక్రమంలో పిలుపునిచ్చిన జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్ : మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. పచ్చదనంతో పర్యావరణం సమతుల్యత లభిస్తుందని కలెక్టర్ అభిప్రాయ పడ్డారు. శుక్రవారం ఉదయం ఆంధ్ర యూనివర్సిటీ లోని ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో వనం - మనం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఎస్.ఎస్.శ్రీధర్ తో కలిసి కలెక్టర్ హాజరయ్యారు.ఈ సందర్భంగా మైదానంలో మొక్కలను నాటి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ చాలాకాలం తర్వాత వనం-మనం కార్యక్రమం ప్రారంభించుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. రాష్ట్రంలో కోటి మొక్కలు నాటి ఆంధ్ర ప్రదేశ్ ను హరితాంధ్ర ప్రదేశ్ గా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం సంకల్పించినట్లు చెప్పారు. దానికి శ్రీకారం చుట్టే విధంగా విశాఖపట్నం నగరంలో నేడు వనం - మనం కార్యక్రమాన్ని నిర్వహించు కుంటున్నామని అన్నారు. మీ పరిధిలో, మీ వీధిలో, మీ ఇంటి ముందు, పార్కుల్లో మొక్కలను వేసి పెంచడమే దీని లక్ష్యమన్నారు. అలాగే మీ దృష్టిలో ఉండే ఖాళీ స్థలంలో కూడా మొక్కలను పెంచవచ్చని తెలిపారు. పచ్చదనంతో పర్యావరణ సమతుల్యత లభిస్తుందని అన్నారు. ఎక్కువ చెట్లు ఉన్న చోట చల్లదనం ఉంటుందని, తద్వారా వాతావరణంలో మార్పులు ఉంటాయన్నారు. అందువలన మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, వేసిన మొక్కలను సంరక్షించాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో సాధారణ పౌరులతో పాటు ఎన్.జి.ఓలు, పారిశ్రామిక వేత్తలు కూడా భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. ఈ ఏడాది కోటి మొక్కలు నాటే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ప్రణాళికను సిద్ధం చేయడం జరిగిందని తెలిపారు. జిల్లా తరపున దాదాపు మూడు లక్షల మొక్కలను నాటేందుకు అంచనా వేయడం జరిగిందని కలెక్టర్ వివరించారు. ఇందుకు అటవీ, డ్వామా,పంచాయతీ రాజ్, విద్యా శాఖ, పరిశ్రమల శాఖల ద్వారా మొక్కలను వేసి పెంచే బాధ్యతను తీసుకో బోతున్నామని అన్నారు. మొక్కలను సంపదగా భావించాలని, అందుకే దాన్ని కాపాడు కోవలసిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం పార్లమెంటు సభ్యులు ఎం. శ్రీభరత్, విశాఖ ఉత్తర నియోజకవర్గం శాసనసభ్యులు పి.విష్ణుకుమార్ రాజు,ప్రిన్సిపల్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ డా.ఎస్.ఎస్.శ్రీధర్, చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శ్రీకాంత నాథ రెడ్డి, జీవిఎంసి కమిషనర్ పి.సంపత్ కుమార్, ఇందిరా గాంధీ జూలాజికల్ పార్క్ క్యూరేటర్ డా.నందనీ సలారియా, డిప్యూటీ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ జి.మంగమ్మ, జిల్లా అటవీ శాఖాధికారి సీహెచ్. ధర్మరక్షిత్, అటవీ రేంజ్ అధికారి బి.రామ్ నరేష్, 22వ వార్డు కార్పొరేటర్ పీవిఎల్ఎన్.మూర్తి యాదవ్, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రసాదాల నాణ్యత విషయంలో అలసత్వం వహించేది లేదు

విశాలాంధ్ర - గోపాలపట్నం : ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహలక్ష్మీనరసింహస్వామి వారి ప్రసాదాల నాణ్యత, రుచిను ఈఓ ఎస్.శ్రీనివాసమూర్తి భక్తులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రసాదాల నాణ్యత విషయంలో అలసత్వం వహించేది లేదని అన్నారు. అప్పడప్పుడు ఇలా ప్రసాదాల నాణ్యత రుచి, తదిరత అంశాలను భక్తులను అడిగి తెలుసుకోవాలని ఏ.ఈఓ ఆనంద్ కుమార్‌కు ఆదేశించారు.

పచ్చని చెట్లతో కాలుష్య రహిత ప్రపంచానికి నాంది

విశాలాంధ్ర - మధురవాడ: పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత అని, పచ్చని చెట్లతో కాలుష్య రహిత ప్రపంచానికి నాంది పలికినట్లేనని 5వ వార్డ్ కార్పొరేటర్ మొల్లి హేమలత అన్నారు. శుక్రవారం వనం-మనం కార్యక్రమంలో భా గంగా సాయిరాం కాలనీ ఎలిమెంటరీ స్కూల్ ఆవరణంలో మొక్కలు నాటారు. వనం-మనం ఓ యజ్ఞంలా నిర్వహించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటు పడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు, వార్డ్ బిసి సెల్ అధ్యక్షులు బొడ్డేపల్లి రంగారావు, వైకుంతరావు, కరుమాజు గోవిందరావు, యోగేశ్వర రావు, దుర్గారావు, నారాయణరావు, మహిళ నాయకురాలు దేవి, ఆదిలక్ష్మి, సచివాలయ కార్యదర్శులు, వార్డ్ శానటరీ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

1న గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్ -2024

విశాలాంధ్ర - విశాఖ సిటీ : సెప్టెంబర్ ఒకటవ తేదీన " గ్లోబల్ ఎడ్యుకేషనల్ ఫెయిర్ -2024" నిర్వహిస్తున్నట్లు ఏవీన్ ఓవర్సీస్ (ద్వారకానగర్) సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డి.ఏ. రాజు వెల్లడించారు. శుక్రవారం విజేఎఫ్ ప్రెస్ క్లబ్ లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమం పామ్ బీచ్ హెూటల్ లో సెప్టెంబర్ ఒకటో తేదీ ఉదయం 10 గంటలు నుంచి సాయంత్రం 5 గంటలు వరకు జరుగుతుందని అన్నారు. ఈ ఫెయిర్ లో 15కి పైగా దేశాలు నుంచి టాప్ - 40 యూనివర్సిటీలు పాల్గొంటాయి అన్నారు. ఈ ఫెయిర్ లో బ్యాచ్ లర్స్, ఎంఎస్, ఎంబిఏ, ఎంబిబిఎస్, కోర్సుల్లో ప్రవేశాల కోసం అవగాహన కల్పిస్తాం అన్నారు. విద్యార్థులకు ఉపకార వేతనాలు సదుపాయం కూడా వుంటుంది అన్నారు. విద్యార్థులు సందేహాలు నివృత్తి చేస్తాం పేర్కొన్నారు. త్వరలోనే తమ సంస్థకు అనుబంధంగా ఏర్పాటు చేసే ఫౌండేషన్ ద్వారా పేద విద్యార్థులకు ఆర్థిక సాయం చేసే ఆలోచనలో ఉన్నామన్నారు. యూనివర్సిటీ ప్రతినిధులు నేరుగా విద్యార్థులతో ముఖాముఖిలో పాల్గొని వివరాలు అందజేస్తారు అన్నారు. కాలిఫోర్నియా, సౌత్ కరోలినా, బ్రిడ్జ్ పోర్టు, సిటీ, అప్ స్టేట్, సెయింట్ మేరీ, ఎమిటి, వంటి ప్రముఖ యూనివర్సిటీలు ఈ ఫెయిర్ లో పాల్గొంటాయి అన్నారు. ఆసక్తి గల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొనాలి అని కోరారు. మీడియా సమావేశంలో సంస్థ మేనేజర్ బీ. రవి తేజ, బిజినెస్ డెవలప్మెంట్ మేనేజర్ ఆర్. క్రిస్టోఫర్ పాల్గొన్నారు.

మన జీవన విధానం భావితరాలకు స్ఫూర్తిగా ఉండాలి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్ : కొత్త సంస్కృతిని, జీవన విధానాన్ని అలవర్చుకొని భావితరాలకు స్ఫూర్తిగా నిలవాలని విశాఖ స్టీల్ ప్లాంట్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ ఎస్ కరుణ రాజు అన్నారు. ప్రస్తుత పరిస్థితులు మారాయని, ఆత్మవిశ్వాసంతో కష్టపడి పనిచేసే తత్వాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. బాబాసాహెబ్ అంబేద్కర్ ఈ విషయాన్ని పదే పదే చెప్పారని తెలిపారు.భెల్ మాజీ డిప్యూటీ మేనేజర్, విశాఖ కోఆపరేటివ్ బ్యాంక్ మాజీ డైరెక్టర్,సామాజిక కార్యకర్త,తెన్నేటి పద్మావతి సంస్మరణ సభ పబ్లిక్ లైబ్రరీలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా 'ప్రాకారాలు దాటి ఆకాశం తాకిన తెన్నేటి పద్మావతిలి' అనే పుస్తకాన్ని కనకరాజు ఆవిష్కరించారు. అదే విధంగా లిమద్యపానం వ్యసనం విముక్తిలి అనే పుస్తకాన్ని మాజీ ఐఏఎస్ అధికారి, ఎమ్మెల్యే పి. రామాంజనేయులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కరుణరాజు మాట్లాడుతూ తమ కాళ్ళపై తాము నిలబడే విధంగా కష్టపడి పనిచేయడాన్ని అలవాటు చేసుకోవాలి అన్నారు. తెన్నేటి పద్మావతి వ్యక్తిత్వం జీవితం పరిశీలిస్తే ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉందన్నారు. మనకంటూ సాంస్కృతి సామాజిక దృక్పథం కలిగి ఉండాలన్నారు. మనకంటూ ఒక సొంత బాట ఉండాలని అభిప్రాయ పడ్డారు. పత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ పద్మావతి ఎంతో ఆత్మ గౌరవంతో జీవనం సాగించారని సామాజిక సేవలో పాల్గొన్నారని తెలిపారు. మద్యానికి బానిసై జీవితాలను పాడు చేసుకుంటున్న కార్మికుల జీవన విధానం మారే విధంగా కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్ష వహించిన డాక్టర్ తెన్నేటి జయరాజు మాట్లాడుతూ ఎంతో క్రమశిక్షణతో,నిబద్ధతితో ఆత్మాభిమానంతో ఆమె బతకారని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బోనెల విజయ్ చందర్ , మాజీ వైస్ ఛాన్సలర్ ఆచార్య వీరయ్య, విశాఖ కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు, ఆచార్య శ్రీనివాస్, అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు బి కళ్యాణ్ రావు ,జేవి ప్రభాకర్, మాజీ కార్పొరేటర్ కొప్పుల వెంకట్రావు, బీఎస్పీ నాయకులు శివప్రసాద్, డాక్టర్ ప్రగతి పాల్గొన్నారు.

నారా లోకేష్‌ను కలిసిన సీపీఎం బృందం

విశాలాంధ్ర - భీమిలి : గౌరవ మంత్రివర్యులు నారా లోకేష్ ను భీమిలి కస్తూరిబాయ్ హాస్టల్ వద్ద కలిసి వినతి పత్రం సమర్పించిన భీమిలి సిపిఎం పార్టీ బృందం! ఈ సందర్భంగా సిపిఎం పార్టీ భీమిలి జోన్ కార్యదర్శి ఆర్ ఎస్ ఎన్ మూర్తి మాట్లాడుతూ ఆనందపురం మండలం కుసులవాడ పంచాయతీ పరిధిలో 104 సర్వే నెంబర్లో మైనింగ్ తవ్వకాలకు 28వ తేదీ నాడు ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా ప్రజలందరూ తీవ్రంగా వ్యతిరేకించారు కాబట్టి ప్రజల అభిప్రాయం మేరకు భవిష్యత్తులో ఎటువంటి అనుమతులు ఇవ్వద్దని కుసులవాడ పంచాయతీ పరిధిలో కుసులవాడా రేగన్న గూడెం చెన్నయ్యపాలెం ఇచ్చాపురం ఎస్సీ కాలనీ గొల్లపాలెం ఈ గ్రామాలన్నీ కూడా మైనింగు ఉన్న కొండ చుట్టూ ఉన్నాయి ఈ ప్రాంతంలో పచ్చటి పంటలు పూల తోటలు కొబ్బరి చెట్లు అరటి చెట్లు చెరువుల అనేక పంట పొలాలు ఉన్నాయి కాబట్టి! ఈ ప్రాంత పర్యావరణాన్ని పచ్చదనాన్ని కాపాడాలని ప్రజలకు అనేక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని వారు ప్రాణాలు కాపాడవలసిన బాధ్యత ప్రభుత్వానికి ఉందని వారు అన్నారు సిపిఎం పార్టీ నాయకులు వినతి పత్రం సమర్పిస్తూ లోకేష్ గారికి వివరించడం జరిగింది! ఆర్ఎస్ఎన్ మూర్తి రవ్వ నర్సింగరావు ఎస్ అప్పలనాయుడు! లోకేష్ గారిని కలిసిన వారిలో ఉన్నారు.

మంత్రి నారా లోకేష్ రాకతో విశాఖ పార్టీ కార్యాలయంలో సందడి

దాదాపు 2 వేల మందిని కలిసి, విన్నపాల స్వీకరణ

విశాలాంధ్ర - విశాఖ సిటీ : తన రెండో రోజు పర్యటనలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ను కలిసేందుకు స్థానిక ప్రజలు, వివిధ జిల్లాల నాయకులు, కార్యకర్తలు పార్టీ కార్యాయానికి పెద్దఎత్తున తరలివచ్చారు. దాదాపు 2వేల మందిని ప్రత్యక్షంగా కలిసిన మంత్రి.. వారి నుంచి విన్నపాలు స్వీకరించారు. ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించి యోగక్షేమాలు అడిగారు. అనంతరం వారితో ఫోటోలు దిగారు. సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొట్టమొదటి సారిగా మంత్రి నారా లోకేష్ విశాఖకు రావడంతో జిల్లా పార్టీ కార్యాలయంలో సందడి వాతావరణం నెలకొంది.

జీవీఎంసీలో సిసిపి సురేష్‌నే కొనసాగించేందుకే ప్రభుత్వం పునరాలోచన...

విశాఖ అభివృద్ధికి క్రియాశీలక అధికారి అవసరమని కోరిన ప్రజా పతినిధులు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : విస్తరిస్తున్న విశాఖలో పట్టణ ప్రణాళిక పనితీరు మరింత ప్రతిష్టాత్మకం కావడంతో సమర్థ అధికారిగా ఉన్న చీఫ్ సిటీ ప్లానర్ బి సురేష్ కుమార్ ని కొనసాగించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం, మంత్రులు, జీవీఎంసీ కమిషనర్లు గా పని చేసిన వారు, ఆ శాఖ ముఖ్య కార్యదర్శి చెప్పిన పనులు చేయడమే తప్ప సీసీపీ వ్యక్తిగతంగా అడ్డదారిలో ఏ పనులు చేసే అవకాశం లేదని పురపాలక శాఖ మంత్రి నారాయణ మరోసారి పునరా ఆలోచనలో పడినట్లు తెలిసింది. రాష్ట్రంలో తాజాగా 9 మంది టౌన్ ప్లానింగ్ అధికారులను బదిలీ చేసిన నేపథ్యంలో సురేష్ ను కూడా బదిలీ చేశారు. రాష్ట్రంలో అతిపెద్ద నగరంగా ఉన్న విశాఖలో భవన నిర్మాణ రంగం శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో నగరంపై పూర్తి అవగాహన ఉన్న యువ అధికారిగా ఉన్న సురేష్ ని మళ్ళీ సిసిపిగా కొనసాగించాలని విశాఖ జిల్లా ప్రజా ప్రతినిధులు అంతా పురపాలక మంత్రిని కోరినట్లు సమాచారం. జీవీఎంసీలో సీసీపీ పోస్ట్ కీలకం కావడంతో సమర్థవంతమైన అధికారే ఉండాలని తద్వారా ప్రభుత్వానికి మేలు జరుగుతుందని కూటమి ఎమ్మెల్యేలు అంతా ముక్తకంఠంతో విశాఖ పర్యటనలో ఉన్న మంత్రి లోకేష్‌కు చెప్పినట్లు సమాచారం. అడిషనల్ డైరెక్టర్ క్యాడర్ లో 8 మంది అధికారులు ఉన్నప్పటికీ ఎవరు విశాఖలో విధులు నిర్వహించడానికి ముందుకు రావడం లేదని తెలుస్తుంది. గతంలో సీసీపీగా సునీత వచ్చిన ఆరు నెలలకే వెనక్కి వెళ్లిపోయిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం నాగ సుందరి ని జీవీఎంసీ సీసీపీ నియమించాలని మంత్రి భావించినప్పటికీ ఆమె విముఖత వ్యక్తం చేయడంతో డైరెక్టర్ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని తాజా బదిలీ ఉత్తర్వుల్లో తెలిపారు. వెంకటసుబ్బయ్య, ప్రభాకర్ లు కూడా తాము జీవీఎంసీ కి వెళ్ళబోమని తేల్చి చెప్పినట్లు తెలిసింది. పార్టీలతో సంబంధం లేకుండా, అందరితో సమన్వయం చేసుకుంటూ వివాదా రహితుడిగా, సమర్థుడిగా నిత్యం నగర ప్రణాళిక అభి వృద్ధికి శ్రమిస్తున్న సురేష్ సీసీపీగా కొనసాగించాలని బిల్డర్లు, రియాల్టర్ వ్యాపారులు, అన్ని రాజకీయ పార్టీల ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు కోరుతున్నట్లు సమాచారం. కొర్రీలు వేసే కొత్త అధికారిని తీసుకొచ్చి సిసిపి కుర్చీలో కూర్చో బెట్టవద్దని, విశాఖలో నిర్మాణరంగంతో పాటు నగర ప్రణాళిక విభాగాన్ని, రోడ్ల విస్తరణతో చేపట్టి నగర సుందరీకరణకు తోడ్పడే సురేష్ లాంటి అధికరణ కొనసాగించాలని కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు కోరుతున్నట్లు తెలిసింది. ఎప్పటికే పలువురు ఎమ్మెల్యేలు సురేష్ ను కొనసాగించాలని సిఫార్సు లేఖలు కూడా మంత్రికి అందజేశారు. అయితే ఇటీవలే జీవీఎంసీ కమిషనర్ గా వచ్చిన సంపత్ కుమార్ కూడా సమర్థవంతంగా టౌన్ ప్లానింగ్‌లో విధులు నిర్వహిస్తున్న సిసిపి సురేష్ ను కొనసాగించాలని పురపాలక శాఖ మంత్రికి, ఆ శాఖ ముఖ్య కార్యదర్శి కోరినట్లు తెలిసింది. జివిఎంసికి అత్యధిక ఆదాయం భవన నిర్మాణ అనుమతుల ద్వారా వస్తుంది. నిర్మాణ అనుమతుల తో పాటు నియంత్రణ, ప్రజల సమస్యలు, భవిష్యత్ నగర విస్తరణ, అవసరాలు వంటి వాటిపై పూర్తి అవగాహన కలిగిన సురేష్ మరి కొంతకాలం సీసీపీ గా కొనసాగించాలని విశాఖ వాసుల కూడా కోరుతున్నట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలపై విచారణ జరపాలన్న, పూర్తిస్థాయి వివరాలను వెల్లడించడానికి సురేష్ ఇక్కడ సీసీపీగా విధులు నిర్వహించడమే మేలు జరుగుతుందని సిఐడి, ఇంటిలిజెన్స్ వంటి విభాగాల అధికారులు కూడా అభిప్రాయ పడుతున్నారు. ఒకటి రెండు రోజుల్లో కొత్తవారిని నియమిస్తారా? సురేష్‌నే కొనసాగిస్తారా? తెలియనుంది.

శాశ్వత పరిష్కారం చూపండి ఎమ్మెల్యే సార్

విశాలాంధ్ర - గోపాలపట్నం : గ్రేటర్ విశాఖ నరవ నుండి కొత్తపాలెం వెళ్లే దారిలో చర్చ్ దగ్గర అక్రమ కట్టడాలతో నీరు ప్రవహించే కాలువలు కబ్జాలు చేయడంతో మెయిన్ రోడ్డుపై నీరు ఉండిపోవడంతో అటుగా ప్రయాణించే సుమారు 10 గ్రామాల వాహన దారులకు రాక పోకలకు ఇబ్బందులు తప్పుటం లేదు పశ్చిమ నియోజక వర్గం ఎమ్మెల్యే గణబాబు, 89 వ వార్డు కార్పొరేటర్ దాడి వెంకట రమేష్ గారు, అలాగే 88 వ వార్డు కార్పొరేటర్ మొల్లి ముత్యాల నాయుడు చుట్టూ ప్రక్కల కూటమి నాయకులు వచ్చి శుక్రవారం అక్కడ వాస్తవ పరిస్తితి నీ సందర్శించారు ఈ సమస్యను తక్షణమే రెవెన్యూ వారిచే సర్వే చేయించి అక్రమ కట్టడాలను తొలగించి శాశ్వత పరిష్కారం చేయాలని అటుగా ప్రయాణించే ప్రజలు కోరుకుంటున్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - పెందుర్తి : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బిజెపి నియోజకవర్గం కన్వీనర్ గొర్లె రామునాయుడు ప్రజలకు పిలుపునిచ్చారు. జీవీఎంసీ నిర్వహిస్తున్న ఫ్రైడే - డ్రైడే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా గొర్లె రాము నాయుడు పాల్గొన్నారు. 95వ వార్డు పాపయ్య రాజుపాలెంలో స్థానిక సచివాలయ సిబ్బంది సానిటరీ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో ప్రతి శుక్రవారం జరిగే డ్రైడే పాటించండి అని, పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వండి అని, మలేరియా డెంగ్యూ వ్యాధులను వివరించండి అని, డెంగ్యూ మరియు చికెన్ గునియా జ్వరాలపై రక్తం తాగే దోమల నివారణ పై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా గొర్లె రాము నాయుడు మాట్లాడుతూ మలేరియా డెంగ్యూ చికెన్ గున్యా వ్యాధులకు కారణం దోమ అని దోమలే వృద్ధి చెందే ప్రదేశాల్లో చూపించి దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. నీటి నిల్వలు లేకుండా చూడాలని స్థానికులకు అవగాహన కల్పించారు. చికిత్స కంటే నివారణ ఉత్తమమని చెప్పారు. ఈ సదస్సులో బిజెపి పెందుర్తి నాయకులు, లక్ష్మణ్, స్థానిక నాయకులు జీవీఎంసీ సిబ్బంది సచివాలయం సిబ్బంది సానిటరీ ఇన్స్పెక్టర్, ఆశా వర్కర్స్ పాల్గొన్నారు.

ఏపీలో స్కూళ్లను దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

భీమిలి కస్తూరిబా స్కూలులో మంత్రి లోకేష్ ఆకస్మిక తనిఖీ

స్కూలులో సౌకర్యాలపై విద్యార్థినులను ఆరాతీసిన మంత్రి లోకేష్

విశాలాంధ్ర - భీమిలి : భీమిలిలోని కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాన్ని మంత్రి నారా లోకేష్ ఆకస్మిక తనిఖీ చేశారు. 10వతరగతి క్లాస్ రూమ్ ను సందర్శించి అక్కడ పాఠ్యాంశాల బోధన, సౌకర్యాలపై విద్యార్థినులను ఆరాతీశారు. వెలుపల చెప్పులు వదిలి మంత్రి క్లాస్ రూమ్స్ ను సందర్శించారు. క్లాస్ టీచర్ను గౌరవిస్తూ తమ పక్కనే కూర్చొని వివరాలు చెప్పాలని కోరారు. పరీక్షలు ఏ లాంగ్వేజ్‌లో సులభతరంగా ఉన్నాయని అడిగారు. తెలుగులో మాట్లాడటం సులభంగా ఉంటుంది, పరీక్షలు ఇంగ్లీషులోనే రాస్తున్నామని తెలిపారు. ఎలక్ట్రానిక్ బ్లాక్ బోర్డు ఉపయోగకరంగా ఉందా అని ఆరా తీశారు. వెనుకబడిన విద్యార్థుల కోసం పాఠశాలలో ఏర్పాటుచేసిన రెమిడియల్ క్లాస్ రూమ్ ను మంత్రి సందర్శించారు. అక్కడ ఏర్పాటుచేసిన టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ ను పరిశీలించారు. మీ డ్రీమ్స్ ఏమిటి? జీవితంలో ఎటువంటి లక్ష్యాన్ని చేరుకోవాలని అనుకుంటున్నారని ప్రశ్నించిన మంత్రి, ఒక లక్ష్యాన్ని ఏర్పాటుచేసుకుంటే సాధించేవరకు వదలకూడదని అన్నారు. ఈ స్కూలు నుంచి ఇద్దరు విద్యార్థినులు ట్రిపుల్ ఐటిలో సీట్లు సాధించడంపై మంత్రి అభినందించారు. విద్యార్థినులు బాగా చదివి తల్లిదండ్రులకు స్కూలుకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా సర్వశిక్ష అభియాన్ ఏపిసి శ్రీనివాసరావు గారు మాట్లాడుతూ విశాఖపట్నం జిల్లాలో గల కెజిబివి పాఠశాలల్లో స్టూడెంట్- టీచర్ , లెర్నింగ్ మెటీరియల్, స్టోరీ టెల్లింగ్, మైండ్ గేమ్స్ , వివిధ అంశాల పై వీడియోస్ తయారు చేసి రాష్ట్రవ్యాప్తంగా 352 స్కూళ్లకు పంపుతున్నామని చెప్పారు. ఇప్పటివరకు పాఠ్యాంశాలకు సంబంధించి 2వేల వీడియోలు తయారు చేశామని తెలిపారు. తర్వాత ఇన్నోవేషన్ క్లాస్ రూమ్ ను మంత్రి సందర్శించారు. అక్కడ కూడా రకరకాల పరికరాలకు సంబంధించిన చిత్రాలను విద్యార్థినులు ప్రదర్శించారు. ఆయా పరికరాల విశిష్టత ఏమిటని విద్యార్థినులను ప్రశ్నించి సమాధానాలు రాబట్టారు. ఇక్కడ మంచి లైబ్రరీ ఏర్పాటు చేశారంటూ సంతృప్తి వ్యక్తంచేశారు. రెడ్డీ ల్యాబ్స్ వారు అందజేసిన కెమికల్స్ ను పరిశీలించారు. అవి ఏవిధంగా ఉపయోగకరంగా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. లోకల్ ఫర్ వోకల్ పేరుతో ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్ ను మంత్రి లోకేష్ సందర్శించారు. స్థానిక ఉత్పత్తులను ప్రపంచానికి పరిచయం చేయడమే తమ లక్ష్యమని విద్యార్థినులు తెలిపారు. కెజిబివిలో బోధనా పద్ధతులు, సౌకర్యాలను ప్రిన్సిపాల్ కుమారి గంగ మంత్రికి వివరించారు. విద్యార్థినులతో కలిసి మంత్రి లోకేష్ ఫోటో దిగారు. మంత్రి దృష్టికి విద్యార్థినుల సమస్యలు చివరిగా స్కూలు డార్మెటరీని మంత్రి లోకేష్ సందర్శించారు. అక్కడ సౌకర్యాలపై విద్యార్థినులను ఆరాతీశారు. టాయ్ లెట్స్ ను పరిశీలించారు. విద్యార్థినులు సమస్యలు చెబుతూ తమకు ల్యాబ్ కెమికల్స్, కంప్యూటర్ ల్యాబ్ సౌకర్యాలు కల్పించాలని కోరారు. ప్లేగ్రౌండ్ చిన్నదిగా ఉందని, పెద్ద ప్లేగ్రౌండ్ సౌకర్యం కల్పించాలన్నారు. స్కూలుకు వచ్చే అప్రోచ్ రోడ్డు సరిగా లేదు, రహదారి సౌకర్యం కల్పించాలి. డార్మెటరీలో బెడ్స్ లేక ఇబ్బంది పడుతున్నాం. హెల్త్ కిట్స్ అందించాలి. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, అట్యా-పాట్యాలో రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు వెళ్తున్నాం. సౌకర్యాలు కల్పిస్తే మరింత ప్రతిభ కనబరుస్తాం. క్రికెట్ లో గుజరాత్ వెళ్లి జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నామని విద్యార్థినులు చెప్పగా, మంత్రి లోకేష్ వారిని అభినందించారు. ఇకపై రాష్ట్రంలో ఇంటర్ స్కూల్ స్పోర్ట్స్ కాంపిటీషన్స్, స్పోర్ట్స్ మీట్, సైన్స్ ఫేర్ నిర్వహిస్తామని చెప్పారు. విద్యార్థినులకు అవసరమైన హెల్త్ పరికరాల కిట్స్ కూడా అందజేస్తామని తెలిపారు. భీమిలి కస్తూరిబా స్కూలులో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటుచేస్తాం. అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. విద్యాశాఖ మంత్రి లోకేష్ గారి ఆకస్మిక తనిఖీ లో భాగంగా కెజిబీవిస్ సెక్రటరీ మధుసూదన రావు గారు, ఆర్ జే డి విజయభాస్కర్ డిఇఒ చంద్రకళ , ఏపిసి శ్రీనివాస్ రావు , జిసిడిఒ కలేషా బేగం ఎంఈఓ 1 శివ రాణి, ఎంఈఓ 2 జయప్రద, డైట్ కళాశాల సిబ్బంది, డీసీవీ సెక్రటరీ ,విద్యాలయం ప్రిన్సిపాల్ గంగా కుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా సామూహిక వరలక్ష్మి వ్రతాలు

విశాలాంధ్ర - నక్కపల్లి : మండలంలో శుక్రవారం రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ఆమె నివాసం వద్ద శ్రావణ శుక్రవారం సందర్భంగా నియోజకవర్గ స్థాయిలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున మహిళలు హాజరయ్యారు. ఈ మేరకు లక్ష్మిదేవి అలంకరణతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడుతూ ప్రతి సంవత్సరంలాగే ఈ సంవత్సరం కూడా సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సకల సౌభాగ్యాలతో లోకమంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సుమారు 2500 మంది మహిళలు పాల్గొన్నారని, రాష్ట్రంలో ప్రజలు సంతోషంగా ఉండాలని, ఎన్డీఏ కూటమి నాయకులకు లక్ష్మిదేవి ఆశీస్సులు ఎప్పుడు ఉండాలన్నారు. అనంతరం ముత్తయిదువలకు, మహిళలకు వస్త్రాలను బహుకరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు గెడ్డం బుజ్జి, తేదెపా నాయకులు కొప్పిశెట్టి వెంకటేష్, లాలం కాశీనాయుడు, అమలకంటి అబద్దం, జానకీ శ్రీను, గుర్రం రామకృష్ణ పాల్గొన్నారు.

గ్రామీణ విత్తనోత్పత్తి పథకం

విశాలాంధ్ర - పద్మనాభం : కృష్ణాపురం మరియు పొట్నూరు గ్రామల్లో గ్రామీణ విత్తనోత్పత్తి పథకం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగినది. ఈ పథకం యొక్క ముఖ్య ఉద్దేశం ను భీమిలి సహాయ వ్యవసాయ సంచాలకులు బి విజయ ప్రసాద్ మాట్లాడుతూ ఈ రెండు గ్రామలలో ఎంపిక చేసిన రైతులకు బిపిటి 5204 రకం వరి విత్తనాలను 60 బస్తాలు ఇవ్వడం జరిగిందని అన్నారు. ఈ రైతులు పంట పండించి వచ్చే సంవత్సరానికి ఆ విత్తనాలను ఆ గ్రామ రైతులకు అందివ్వాలి అని మిగిలినవి ఇతర గ్రామల రైతులకు ఇవ్వవచ్చును అని తెలియజేశారు. ఈ పథకం వల్ల రైతులు నాణ్యమైన విత్తనాలు తయారు చేసుకోగలరు అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల సహవ్యవసాయ చంచాలకులు సి ఎచ్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఎరువులు పురుగుల మందు లు విసక్షణరహితంగా వాడకూడదు అని, వ్యవసాయ అధికారులు సూచనల మేరకు వాడాలని చూచించారు. మరియు సహసంచాలకులు జె హరికృష్ణ మాట్లాడుతూ బీడీపీటీలు వాటి నివారణ కలుపు మొక్కల నివారణ గురించి సూచనలు సలహాలు తెలియజేశారు .ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్ర వ్యవసాయ అధికారి సిహెచ్ సురేష్ ,మండల వ్యవసాయ అధికారి ఎంవిఎస్ చలం, సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

వర్షాకాలంలో దోమల నివారణకు అందరూ కృషి చేయాలి

విశాలాంధ్ర - ఆనందపురం : మండలం లోని ఇర్మాపురం గ్రామం లో శుక్రవారం ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జరుగుతున్న డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షం కాలంలో ఎక్కువగా వచ్చే మలేరియా వ్యాధి రాకుండా ఉండాలంటే దోమలు వ్యాప్తిని అరికట్టాలని సూచించారు. ఇంటి లోని నీటి నిల్వలు ఎక్కువ రోజులు వుంచితే వాటిలో దోమలు గుడ్లు పెడతాయి అని, తద్వారా దోమలు వృద్ధి చెందుతాయని తెలిపారు. లార్వా దశ లోనే దోమల వ్యాప్తి ని అరికట్టాలని, దాని కోసం వారానికి ఒకసారి పూర్తిగా నీటి నిల్వలు తీసివేసి కొత్త నీటిని నింపాలని కోరారు. అలాగే తాగి పడవేసిన కొబ్బరి బోండాలు, టీ కప్పులలో వర్షం నీరు చేరి దోమల వ్యాప్తి జరుగుతుందని, దీనిని కూడా అరికట్టాలని చెప్పారు. సామాజిక ఆరోగ్య అధికారి పి సాంబమూర్తి, మాట్లాడుతూ విరోచనాలు, టైఫాయిడ్ లాంటి వ్యాధులు రాకుండా పరిశుభ్రమైన ఆహారం, నీరు తీసుకోవాలని సూచించారు. కాచి చల్లార్చి న నీటిని తాగాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు కృష్ణ మోహన్, ఎం ఎల్ హెచ్ పీ.స్వర్ణలత, ఏఎన్ఎం పెట్ల దేవి, ఆశ కార్యకర్త దేముడమ్మ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కారం కొరకు ఉక్కు యాజమాన్యం హామీ

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం : స్టీల్ ప్లాంట్ కాంట్రాక్ట్ లేబర్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్టీల్ ప్లాంట్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో ఈడీ వర్క్స్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సంరంభంగా జిల్లా అధ్యక్షులు కెఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ బయోమెట్రిక్ హాజరు విధానముతో, పరిమిషన్లు ఇబ్బందులు దృష్ట్యా పని చేసిన రోజులకు జీతాలు చెల్లిస్తామని. సిజిఎం వర్క్స్ ఇంచార్జీ. యు శ్రీధర్ హామీ ఇచ్చి నట్లు చెప్పారు.పనిదినాలు కుదింపు. కార్మికులను తగ్గించే విషయం అలాగే ఇతర సమస్యలను ఉన్నత యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు ఇది కార్మికుల పోరాటం ఫలితం అని అన్నారు యాజమాన్యం ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం సి జి ఎం వర్క్స్ ఇంచార్జ్ కి వినతిపత్రం అందజేశారు. యూనియన్ అధ్యక్షుడు జి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు నాయకులు ఓ.వి.రావు నమ్మి రమణ కెవి సుబ్రమణ్యం. మసేను. శశిభూషణ్. సోమేష్. వరహాలు ఎన్ కృష్ణ బి కన్నబాబు. కె.సత్యవతి తదితరులు పాల్గొన్నారు. వేలాది మంది కార్మికులు పాల్గొన్నారు

వాహన ఫైనాన్సింగ్ పై యూబీఐతో టీకేయం భాగస్వామ్యం

విశాలాంధ్ర - విశాఖపట్నం : టొయోటా కిర్లోస్కర్ మోటర్ (టికెఎం) నేడు వినియోగదారులకు సమగ్రమైన వాహన ఫైనాన్సింగ్ పరిష్కారాలను అందించటం కోసం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో భాగస్వామ్యం చేసుకుంది. కస్టమర్ అభివృద్ధి చెందుతున్న అవసరాలను తీర్చడం , టొయోటా వాహనాలను గతంలో కంటే మరింత మెరుగ్గా అందుబాటులోకి తీసుకురావడానికి ఆకర్షణీయమైన పరిష్కారాలు అందించడం ఈ భాగస్వామ్యం లక్ష్యం అని టొయోటా కిర్లోస్కర్ మోటార్ సంస్థ యొక్క సేల్స్ సర్వీస్ యూజ్డ్ కార్ బిజినెస్ వైస్ ప్రెసిడెంట్ శబరి మనోహర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ తెలిపారు. దీనిలో భాగంగా వ్యక్తిగత వినియోగం కోసం కొనుగోలు చేసిన ఏదైనా టొయోటా వాహనాల ఆన్-రోడ్ ధరపై 90 శాతం వరకు ఫైనాన్సింగ్‌ను అందించనున్నారు.

శ్రావణ మాసం 3వ శుక్రవారం వరలక్ష్మి దేవి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - కొమ్మది : చంద్రంపాలెం జాతర గట్టు శ్రీ దుర్గాలమ్మ అమ్మవారి ఆలయంలో శ్రావణ మాసం 3వ శుక్రవారం వరలక్ష్మి దేవి ప్రత్యేక పూజలు కార్యక్రమాలు మధురవాడ చంద్రంపాలెం జాతర గట్టు శ్రీ దుర్గాలమ్మ అమ్మవారికి శ్రావణ మాసం కృష్ణ పక్షం చవితి తాళ్లా పంచమి మూడవ శుక్రవారం సందర్భంగా నిత్య అర్చనలతో పూజా కార్యక్రమాలు ప్రారంభించి ప్రత్యేక కుంకుమార్చనలు, పుష్పార్చనలు మొదలగు పూజ కార్యక్రమాలు ఆలయ అర్చకులు పట్నాల హరిప్రసాద్ శర్మ, మూర్తి శర్మలు జరిపించి నీరాజన మంత్రపుష్పం అమ్మవారికి సమర్పించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈరోజు శ్రావణ మాసం మూడవ శుక్రవారం వరలక్ష్మి దేవి రోజు కావడంతో మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కుంకుమార్చనలు జరిపి అమ్మవారి దర్శించుకొని ఆలయ ప్రాంగణంలో దీపాలను వెలిగించారు. ఈ సందర్భంగా చంద్రంపాలెం వాస్తవ్యులు పిళ్లా వెంకటరమణ, అమ్మాజీ దంపతుల సహకారముతో ఏర్పాటు చేసిన పులిహోర ప్రసాదం మరియు దుర్గానగర్ వాస్తవ్యులు రామారావు, లక్ష్మి దంపతులు సహకారంతో ఏర్పాటు చేసిన తీపి బూంది ప్రసాదం అమ్మవారికి సమర్పించి అనంతరం భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు పంపిణీ చేశారు. సాయంత్రం వేళ శ్రీదుర్గాలమ్మ అమ్మవారికి పంచామృత సుగంధ ద్రవ్యాలతో అభిషేకం, సహస్రధార జలాభిషేకం చేసి ప్రత్యేకంగా అలకరణ చేసి కుంకుమార్చనలు పుష్పార్చనలు చేసి నీరాజనం మంత్రపుష్పం సమర్పించి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీదుర్గాలమ్మ అమ్మవారి ఆలయ ధర్మకర్త పిళ్లా చంద్రశేఖర్, ఆలయ కమిటీ అధ్యక్షులు పిళ్లా నూకరాజు, ఉపాధ్యక్షులు పి.వి.జి.అప్పారావు, యస్.యస్. మూర్తి, సెక్రటరీ నాగోతి తాతారావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు, సభ్యులు పిళ్లా వెంకటరమణ, పోతిన పైడిరాజు, దుక్క వరం, పిళ్లా రమణ, పోతిన శివ, పిళ్లా సన్యాసిరావు, భోగవిల్లి రాము, పిళ్లా గౌరి, మరుపిల్లి ఆనంద్, ముఖ్య సభ్యులు పిళ్లా పోతురాజు, పిళ్లా అప్పన్న, యస్.శ్రీను, ఎం.వెంకటరావు, పిళ్లా సూరిపాత్రుడు, దుక్క అప్పారావు, పోతిన రాంబాబు మరియు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేటి నుండి పెన్షన్లు పంపిణీ

విశాలాంధ్ర - నక్కపల్లి : నేటి నుంచి పెన్షనుదారులకు పెన్షన్లు పంపిణీ చేస్తున్నట్లు ఎంపిడివో శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లుతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఎంపిడివో మాట్లాడుతూ శనివారం ఉదయం 5 గంటల నుంచి గ్రామ సచివాలయ పరిధిలో పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించాలని, అన్ని క్లస్టర్‌లలో జరగాలని, పెన్షన్ పంపిణీ విషయాన్ని ప్రజా ప్రతినిధులకు తెలియజేయాలని సూచించారు.

శ్రీ విద్యాంజలిలో కురుక్షేత్రకు విశేష స్పందన

విశాలాంధ్ర - నర్సీపట్నం : జాతీయ క్రీడల దినోత్సవం సందర్భంగా స్థానిక శ్రీ విద్యాంజలి హై స్కూల్లో కురుక్షేత్ర పేరిట పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాఠశాల కరస్పాండెంట్ శాంతి హాజరయ్యారు. దీనిలో భాగంగా మొదటగా హౌస్ కెప్టెన్స్, వైస్ కెప్టెన్స్ లచే పాఠశాల ప్రిన్సిపల్ అయితి రామకృష్ణ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మిగిలిన నాలుగు హౌస్ లైన అగ్ని, వృథ్వి, వరుణ, వాయు లతో మార్చ్ ఫాస్ట్ తో పరేడ్ జరిపారు. ఆటలలో గెలుపొంది విజేతలు గా నిలిచిన వారందరికీ మెడల్స్ బహూకరించారు.స్కూల్ చైర్మన్ అక్షజ్ కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు ఆటలు కూడా ఎంతో ముఖ్యమని ఆటలతోనే మనసుకు ఉల్లాసం లభిస్తుందని అన్నారు. కార్యక్రమం జరుగుతున్నంత సేపు విద్యార్థులంతా కేరింతలతో తమ హర్ష ధ్వనులు వ్యక్తం చేసారు.

సన్ మొబిలిటీతో కలిసి వీర వాహన హెచ్ఈవీ శ్రేణి ఆవిష్కరణ

విశాలాంధ్ర / విశాఖపట్నం : సన్ మొబిలిటీ ఎలెక్ట్రిక్ వాహనాలకు(ఈవి) అగ్రశ్రేణి మౌలిక సదుపాయాలను అందించడంలో నాయకుడిగా ఉంది. అది ప్రపంచంలో మొట్టమొదటి మాడ్యులర్ బ్యాటరీని మార్చే టెక్నాలజీని భారీ వాణిజ్య వాహనాలకు (హెచ్ఈవి)లకు అందించి చరిత్ర సృష్టించింది. ఈ సంస్థ బెంగళూరు ఆధారిత వీర వాహన భాగస్వామ్యంతో ఒక అగ్ర తయారీదారుగా నిలిచింది. భారత దేశంపు మొట్టమొదటి 10.5 మెట్ల బ్యాటరీని మార్చే బస్సులను నగరంలో ప్రవేశపెట్టింది. ప్రవాస్ 4.0 (ట్రోవ్‌లో మొబిలిటీ) అందిస్తుంది. అది ఒక బస్ అండ్ కార్ ఆపరేటర్స్ కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (బీఓసీఐ) నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో వీరవాహనానికి చెందిన అన్ని వాహనాలకు ఇదే టెక్నాలజీతో ప్రవేశపెట్టింది. ఉద్గారాలను తగ్గించడానికి, గాలి నాణ్యతను మెరుగుపరచడానికి, రవాణా రంగం మొత్తం సామర్థ్యాన్ని పెంచడానికి వాణిజ్య విమానాలను, ముఖ్యంగా భారీ వాహనాలను విద్యుదీకరించడం కీలకం. సన్ మొబిలిటీ ప్రయత్నించిన, పరీక్షించిన స్మార్ట్ బ్యాటరీబిమ్ ద్రావణం తేలికపాటి, మీడియం, భారీ (ట్రక్కులు, బస్సులకు అనుకూలంగా ఉంటుంది, ఇది 3 టన్నుల నుండి 55 టన్నుల గ్రాస్ వెహికల్ వెయిట్ (జివిడబ్ల్యు) వరకు ఉంటుంది.

తాటితూరు జడ్పీ హైస్కూల్‌కు సీసీ కెమెరాలు అందజేత

విశాలాంధ్ర - భీమిలి : భీమిలి మండలం తాటితూరు గ్రామ జడ్పీ హైస్కూల్ కు శాలివాహన సేవా సంఘం సభ్యులు మరియు సంఘం ప్రెసిడెంట్ అప్పలరాజు ఆధ్వర్యంలో తాటితూరు జడ్పీహెచ్ హైస్కూల్ కు 40,000 /- విలువగల సీసీ కెమెరాలు మరియు మెటీరియల్ను జడ్పీ హెచ్ హైస్కూల్ ఎస్ఎంఎస్ కమిటీ చైర్మన్ అయిన బుడిమూరు సోమేశ్వరరావు ,హై స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో అందజేయడం జరిగినది. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ హై స్కూల్ లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకూడదని ఆలోచనతో ఈ సీసీ కెమెరాలను అందజేయడం జరిగిందని అన్నారు ఈ కార్యక్రమంలో శాలివాహన సేవా సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు

బ్లడ్ డొనేషన్ క్యాంప్

విశాలాంధ్ర - యలమంచిలి : మండలంలోని మైహోమ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ (సిమెంట్ ఫ్యాక్టరీ) ప్లాంట్ స్థాపించి నేటికీ 17 సంవత్సరములు పూర్తి అయిన సందర్భంగా శుక్రవారం ఎన్.టి.ఆర్. ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో బ్లడ్ డొనేషన్ క్యాంప్ నిర్వహించడం జరిగినదని ఫ్యాక్టరీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (వర్క్స్) వి. హెచ్. చౌదరి అన్నారు.

సింహాద్రిపై వైభవంగా సామూహిక వరలక్ష్మీ వ్రతం

విశాలాంధ్ర - సింహాచలం : ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహలక్ష్మి నరసింహస్వామి వారి చెంతన శ్రావణ శుక్రవారం సందర్భంగా అప్పన్న సన్నిధిలో ఈఓ ఎస్ శ్రీనివాసమూర్తి దంపతులు, ఈతా శ్రీనివాస రాజు, ప్రధాన అర్చకులు జి. శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో సామూహిక వరలక్ష్మీవ్రతం వైభవంగా జరిగింది. సింహగిరిపై మాడవీధుల్లో ప్రధాన రాజగోపురానికి సమీపంలో దేవస్థానం నాద, వేద, ఆగమ పాఠశాల ఆచార్యులు, వేదపండితుల పౌరోహిత్యంలో వైభంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాదాపు మూడు వేల మంది మహిళలు పాల్గొనడం విశేషం. స్మార్త సంప్రదాయం ప్రకారం గణపతి ఆరాధన, పుణ్యాహవచనములతో ప్రతానికి పండితులు శ్రీకారం చుట్టారు. తొలుత ఉచిత యాత్రిక సదన్ లోనూ, భక్తులు అధికంగా రావటంతో గాలిగోపురం ప్రక్కన వేదికపై అమ్మవారి చిత్రపటం, మట్టి విగ్రహాలను ఉంచారు. కలశారాధనచేసి లక్ష్మీదేవికి ఆహ్వానం పలికారు. కలశారాధన సందర్భంగా మహిళలు పుష్పాలు, అక్షితలు, గంధం, పసుపు, కుంకుమతో ఆరాధించారు. లక్ష్మీ అష్టోత్తర శతనామావళిని పండితులు పఠిస్తుండగా భక్తులు అనుసరించారు. వరలక్ష్మీ వ్రతం విశిష్టత స్థానాచార్యులు డాక్టర్ టి.పి.రాజగోపాల్ వివరించారు. అదేవా, పులిహోర ప్రసాదాలను మహానివేదనలు చేశారు. మంగళనీరాజనాలు సమర్పించాక భక్తులకు వేదాశీర్వచనం అందించారు. వ్రతం అనంతరం స్వామి వారి ఉచిత దర్శనం, నిత్యాన్న ప్రసాదాన్ని ఏర్పాటు చేశారు. ముందుగా ప్రకటించిన ప్రకారం వ్రతాల్లో పాల్గొన్న మహిళకు కొండదిగువ నుండి సింహగిరికి, ప్రతం పూర్తయ్యాక తిరిగి కొండ దిగువకు దేవస్థానం ఉచిత రవాణా సదుపాయం కల్పించారు.

1296వ రోజు జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం : విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద 1296 వ రోజు జరుగుతున్న రిలే నిరాహార దీక్ష శిబిరంలో స్టీల్ సిఐటియు ప్రతినిధులు పాల్గొన్నారు. వీరిని ఉద్దేశించి స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె అయోధ్యారామ్ మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిరక్షించబడాలంటే పోరాట మార్గాన్ని మరింత ఉధృతం చేయాలని ఆయన అన్నారు. అందులో భాగంగానే సెప్టెంబర్ 1 తారీకు స్టీల్ సిఐటియు ఆధ్వర్యంలో అగనంపూడి ఎన్ హెచ్ బి జంక్షన్, వడ్లపూడి నడివాడుంట వద్ద, పెదగంట్యాడ లలో ఉదయం 9 గంటల నుండి ఒంటిగంట వరకు ధర్నా నిర్వహిస్తామని ఆయన అన్నారు. దీనిలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. స్టీల్ సిఐటియు సీనియర్ నాయకులు ఎన్ రామారావు మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రజా సంపదతో నెలకొందని ఈ సంపద ప్రజలకే చెందాలని గడచిన 1300 రోజుల నుండి అలుపెరుగని పోరాటం చేస్తున్నామని ఆయన అన్నారు. ఇది ఆంధ్ర రాష్ట్రంలో ప్రజలందరికీ ప్రజలు ప్రాణాల్పం చేశారని, దీనిని నిలబెట్టుకోవడానికి కార్మిక వర్గంతో పాటు ప్రజలు ఉద్యమించ లేదని ఉద్యమించాలని ఆయన అన్నారు. స్థానిక స్టీల్ యాజమాన్యంపై పోరాటంతో పాటు ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటాలు చేయడం ద్వారానే దీనిని కాపాడుకోగలమని ఆయన స్పష్టం చేశారు. పెద్ద ఎత్తున కార్మిక వర్గం పోరాటాలను నిర్మించి దానిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు రామస్వామి, స్టీల్ సిఐటియు నాయకులు బి అప్పారావు, కె గంగాధర్, టిఐ కె రాజు, పుల్లారావు, వి మురళి, డి సత్యనారాయణ, రమేష్, పి జె కె రాజు, మొహిద్దీన్, పవన్ తదితరులతో పాటు వివిధ విభాగాల అధ్యక్ష కార్యదర్శులు అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు. రేపు ఉక్కోత్సు విరమణ చేస్తున్న ఏఐటీయుసి అధ్యక్షులు సిహెచ్ సన్యాసిరావు ని పరిరక్షణ పోరాట కమిటీ ప్రతినిధులు డి ఆదినారాయణ, డివి రమణారెడ్డి, జె అర్ కె నాయుడు, శ్రీనివాస్ నాయుడు, శ్రీనివాస్, రమేష్ తదితరులు సత్కరించి సన్మానించారు.

పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా 3 రోజులపాటు సేవా కార్యక్రమాలు

విశాలాంధ్ర - నర్సీపట్నం : జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా ఈనెల 31 నుండి మూడు రోజులపాటు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించినట్టు ఉమ్మడి విశాఖ జిల్లా జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి పందాడ హరినాథ్, ఉపాధ్యక్షుడు పూడి చక్రవర్తి, సంయుక్త కార్యదర్శి అర్జాడ సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖ సీతమ్మధారలోని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు నివాసంలో జరిగిన కార్యవర్గం సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు వారు వెల్లడించారు. జిల్లాలోని ప్రతి గ్రామంలోనూ పర్యావరణం, పచ్చదనం కోసం మొక్కలు నాటడం, శుభ్రత- పరిశుభ్రత లో భాగంగా గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవడం, అవగాహన కార్యక్రమాలు చేపడతామన్నారు.

ఫియోనా రిఫైన్డ్ ఆయిల్‌ను మార్కెట్‌లో విడుదల చేసిన లావణ్య త్రిపాఠి

విశాలాంధ్ర - విశాఖపట్నం : ఎడిబుల్ ఆయిల్స్ మార్కెట్లో అగ్రగామిగా ఉన్న బంగే ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (బంగే ఇండియా), ఫియోనా రిఫైన్డ్ సన్ ఫర్ ఆయిల్ బ్రాండ్, ఫియోనాను సినీ నటి లావణ్య త్రిపాఠి ప్రారంభించినట్లు సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా లావణ్య త్రిపాఠీ మాట్లాడుతూ "ఫియోనా రిఫైన్డ్ సన్ఫర్ ఆయిల్ లాంచ్ లో భాగమైనందుకు చాలా ఆనందంగా ఉన్నాను. నాకు, వంట అనేది నా కుటుంబానికి ఆరోగ్యకరమైన, రుచికరమైన ఆహారం అందించడం.ఆంధ్రప్రదేశ్ లోని ప్రతి ఇంట్లో ఫియోనా ప్రధాన ఎంపికగా మారుతుందని నేను విశ్వసిస్తున్నాను" అన్నారు. ఫియోనా రిఫైన్డ్ ఆయిలను ఆంధ్రప్రదేశ్ కు తీసుకురావడం పట్ల తన హర్షం వ్యక్తం చేస్తూ, మిస్టర్ దీపక్ శ్రీవాస్తవ- వైస్ ప్రెసిడెంట్ %c% బిజినెస్ హెడ్,బివిసి, మాట్లాడుతూ. "బంగే ఇండియాలో, "శ్రేష్ఠ భద్రతకు ప్రాధాన్యమిస్తూ అత్యధిక నాణ్యత ఉత్పత్తులను అందించాలనే మా నిబద్ధత దృఢంగా ఉంటున్నారు. "ఆంధ్రప్రదేశ్ తెలంగాణాలు సన్ ఫర్ ఆయిల్‌కు కింద పెద్ద మార్కెట్లు అయినపుడుని వినియోగదారుల డిమాండ్ లలో స్థిరమైన పెరుగుదలను చూస్తున్నాయన్నారు. ఈ రెండు ముఖ్యమైన మార్కెట్లలో ఫియోనాను విస్తరించడానికి మా నిర్ణయం వెనుక ఇది ప్రధాన కారణమన్నారు. ఫియోనా రిఫైన్డ్ సన్ఫర్ ఆయిల్ యొక్క ఏ కిష్మైన ప్రయోజనాలను ఆంధ్రప్రదేశ్ అందించడం మాకు చాలా సంతోషంగా ఉందని, పెరుగుతున్న ఈ మార్కెట్లో దీనికి నుండి ఆదరణ లభిస్తుందని విశ్వసిస్తున్నామ్ వివరించారు.

రియల్ మీ 13 సిరీస్ 5జీ, 17,999 నుంచి ప్రారంభం

విశాలాంధ్ర - విశాఖపట్నం : రియల్ మీ 13 సిరీస్ 5జీని దాని ఎనలేని వేగం తో పరిశ్రమ లో ప్రామాణిక పనితీరు ని అందించడానికి మరలా డిస్టైన్ చేయబడినదని సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. రియల్ మీ 13 సిరీస్ 5జిని పరిచయం చెయ్య డానికి ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుం దన్నారు. మెరుగైన ఫీచర్స్ తో అద్భుతమైన పనితీరు తో అది వినియోగదారులకు అందించే మధ్య స్థాయి స్మార్ట్ ఫోన్ మార్కెట్ ని ప్రభావితం చేస్తుందన్నారు. మీడియా టెక్ వారి కమ్యూనికేషన్స్ మరియు మార్కెటింగ్ డైరెక్టర్ అనుజ్ సిద్ధార్థ్ లాంచ్ గురించి మాట్లాడుతూ ఈ డివి సెట్ ఆకర్షణీయమైన డిస్ప్లేని ఆకర్షణీయమైన 10-బిట్ల డిస్ప్లే మద్దతును ఇస్తున్నదన్నారు. రియల్ మీ 13 5జి పరిశ్రమ యొక్క మొదటి టి యు వి ఎస్ యు డి లాగ్ లేని మొబైల్ గేమింగ్ సర్టిఫికెట్ ని అందిస్తున్నదన్నారు. రియల్ మీ 13 రూపాయలకు 5 జి మూడు ఆకర్షణీయమైన రంగులలో అనగా విక్టరీ గోల్డ్, స్పీడ్ గ్రీన్ మరియు డార్క్ పర్పుల్ రంగులలో అందుబాటులో ఉంటుందన్నారు. దానిలో 22,999 రూపాయలకు 8జీబీ+ 128+ జీబీ, 24,999 రూపాయలకు 8 జీబీ+256+జీబీ మరియు 26,999 రూపాయలకు 12జీబీ+ జీబీ256+జీబీ లా మూడు స్టోరేజ్ రకాలలో అందుబాటులో ఉంటుందని వివరించారు.

మంత్రి నారా లోకేష్ 'ప్రజా దర్బార్' కు వినతుల వెల్లువ

విశాలాంధ్ర - విశాఖ సిటీ : ప్రజా కూటమి అధికారం చేపట్టిన తరువాత మొట్టమొదటి సారిగా విశాఖలో పర్యటిస్తున్న విద్య,ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ తన రెండో రోజు పర్యటనలో భాగంగా శుక్రవారం ఉదయం జిల్లా పార్టీ కార్యాలయంలో వివిధ నియోజకవర్గాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలు, ప్రజలను కలుసుకున్నారు. సమస్యల పరిష్కార వేదికైన "ప్రజాదర్బార్" నిర్వహించి ప్రజల నుంచి నేరుగా విజ్ఞప్తులు స్వీకరించారు. అందరినీ ఆప్యాయంగా పలకరించి వారితో కలిసి ఫోటోలు దిగారు. ఆయా సమస్యలను సంబంధిత శాఖలకు పంపి పరిష్కారానికి కృషిచేస్తానని మంత్రి వారికి హామీ ఇచ్చారు. ఇళ్ల స్థలాల ఆక్రమణ వైసీపీ నేతల వేధిస్తున్నారని ఒకరు, ప్రేమించి నాతో వెంటపడి, ఉన్నాది చేతిలో కుమార్తెను కోల్పోయిన తమ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

పేదల ఇళ్లు పడగొట్టిన పెద్దలు, అధికారులపై చర్యలేవీ

న్యాయం కోసం పోరాడుతున్న పేదలకు మద్దతు తెలిపిన జనసేన

విశాలాంధ్ర - చోడవరం : అనకాపల్లి జిల్లా చోడవరం బి.ఎన్. ప్రధాన రహదారిలో స్వయం భూ వినాయకుని గుడి ఎదురుగా ఉన్న ఓ నిరుపేదల ఇంటిని స్థానిక పంచాయతీ అధికారులు, రియల్ ఎస్టేట్ మాఫియా పోలీసులతో కలిసి ఈ నెల 27 తెల్లవారుజామున జెసిబితో నేల కూల్చడం అన్యాయమని జనసేన చోడవరం నియోజకవర్గ ఇన్చార్జి పి.వి.ఎస్. ఎన్.రాజు అన్నారు. న్యాయం కోసం పోరాడుతున్న పేదలను, ఆకారణంగా కూలిన బ్రతుకులను ఓదార్చి, తమ మద్దతును జనసేన శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్షణమే పేదల నివాసాలు కూల్చిన పెద్దలు, బడాబాబులు, అధికారులు, పోలీసులు పై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితుల ఇంట్లో నిద్రిస్తున్న పలువురు స్త్రీలను, చిన్నారి గులను, వృద్ధులను లెక్కచేయకుండా వారిని కొట్టి బయటికి తీసుకొచ్చి, ఆ ఇంటిని పడగొట్టిన సంఘటన దురదృష్టం అన్నారు. క్షేత్రస్థాయిలో జనసేన పార్టీ చోడవరం ఇంచార్జ్ పి.వి.ఎస్. రాజు పార్టీ ముఖ్య నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఈ సంఘటనపై అధికారులను సంప్రదించగా రోడ్డుకి ఆనుకుని డ్రైనేజ్ ని నిర్మించాలని ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఈ సందర్భంలో వారి ఇల్లు కూలినట్లు పంచాయతీ అధికారులు తెలియజేశారన్నారు. అయినప్పటికీ వాస్తవ పరిస్థితి దీనికి విరుద్ధంగా ఉందని, ఆ రోడ్లో ఎటువంటి నిర్మాణాలు లేవు ఎవరి సంబంధ ఉండా డ్రైనేజ్ కావాలని అవ్వ ర్యసలు కూడా లేవు. అలాగే పలువురు చాలా వరకు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకొని శాశ్వత నిర్మాణాలు చేసినప్పటికీ వాటిపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా కేవలం వీరు ఒక్కరి ఇంటిని బాధిత మాత్రమే కూల్చడం వెనుక రియల్ వ్యాపారులు, మాజీ ఉప సర్పంచ్ సాగర్ హస్తం ఉందని, ఈ ఇంటి స్థలాన్ని ఆక్రమించుకోవడం ద్వారా కమర్షియల్ కాంప్లెక్స్ డెవలప్ చేసుకునే ఉద్దేశంతోనే స్థానిక అధికారులతో వారు కుమ్మక్కై ఈ రకమైన దుశ్చర్యకు పాల్పడ్డారని క్షేత్రస్థాయిలో ఉన్న పలువురు వ్యక్తులు తెలియజేయడం జరిగింది. అక్కడ పరిస్థితి చూసిన తరువాత వారికి పూర్తిస్థాయిలో అండగా ఉంటామని తెలియ చేసి, వారికి పూర్తిస్థాయిలో న్యాయం చేస్తామని తెలియజేస్తూ అక్కడ నుంచే స్థానిక అధికారులతో మాట్లాడి న్యాయపరంగా చేయాల్సిన పనులలో ఇంత దుర్మార్గంగా ఎందుకు చేయాల్సి వచ్చిందని అడగడం జరిగింది. అలాగే దీనికి సంబంధించి న్యాయం జరిగే వరకు జనసేన పార్టీ ఆ కుటుంబానికి అండగా ఉంటుందని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో చోడవరం బిజెపి పార్టీ ఇంచార్జ్ రమణమూర్తి, జనసేన పార్టీ మండల పార్టీ అధ్యక్షులు ముటునాయుడు, జిల్లా కార్యదర్శి అల్లం రామప్పరావు , టౌన్ పార్టీ అధ్యక్షులు రమేష్, సి.పి.ఐ. జిల్లా కార్యదర్శి సత్యాడు, ఎ.పి.రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు, పలువురు ముఖ్యనాయకులు, తదితరులు పాల్గొన్నారు.